క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా

రాజుపాలెం : మండలంలోని కొట్టాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామ శివాలయాల నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించాలని ఆ గ్రామ ప్రజలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఆదివారం కలిసి కోరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టాల రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామం నుంచి సుమారు 60 మంది ఎమ్మెల్యే ఇంటి వద్దకు తరలివెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ సొంత నిధులు రూ.10 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే వారితో చెప్పారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అమ్మ నాన్న మదర్ థెరిస్సా షబ్బీర్ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆశ్రమ ప్రెసిడెంట్ వై.హిదాయత్ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున ఆశ్రమం తరపున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం పుణ్యకార్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిషులో విద్యార్థులకు తర్ఫీదు

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో 23 మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషులో తర్ఫీదు ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు కథల పోటీలు, చెస్, క్యారంబోర్డులో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు అన్నవరంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమయ్యే మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి తెలియజేశారు.

20న చలో విజయవాడ

ప్రొద్దుటూరు : కార్మికుల సంక్షేమ బోర్డును కాపాడాలని జూన్ 20న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రొద్దుటూరు ఏరియా ప్రధాన కార్యదర్శి చిన్న ఓబన్న తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు ఏపీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మంది కార్మికులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆరోపించారు. ఇప్పటి వరకు 32వేల క్లెయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. యూనియన్ ప్రొద్దుటూరు ఏరియా అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు శేషారెడ్డి, ఓబులేసు, కుమార్, రాజు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

కడప ఎడ్యుకేషన్: ఒడిశా బాలసోర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో నాయకులతో కలిసి మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైల్వే చరిత్రలోనే జూన్ 2వ తేదీ ఒక చీకటి దినం అన్నారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం రైల్వేశాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణం అన్నారు. వందే భారత్ వంటి ట్రైన్‌లను తీసుకొచ్చామని ఊదర గొట్టడం తప్ప చేసిందేమీలేదన్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖపైన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు స్వరూప్‌తేజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో వెలసిన శ్రీశివకృష్ణ గోశాల, ఎస్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆలయం, సాయిబాబా ఆలయాల్లో ఆదివారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కాశినాయన ఆలయంలో ఏర్పాటు చేసిన తాళాల భజన కార్యక్రమం భక్తులను అలరించింది. గోశాలలో గోమాతలను అలంకరించి పూజలు నిర్వమించారు. అనంతరం గీతాపారాయణం, భాగవత పఠనం కార్యక్రమం చేట్టారు. భక్తులకు కాశినాయన ఆలయ దర్మకర్త పుల్లారెడ్డి, గోశాల నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సబ్‌డీఎఫ్‌ఓ దివాకర్, అధికారులు



వివిధ రకాల ప్రాజెక్టులతో విద్యార్థినులు

ఎకోపార్కులో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సబ్‌డీఎఫ్‌ఓ దివాకర్

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సబ్ డీఎఫ్‌ఓ దివాకర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ రహిత జీవనశైలికి సంబంధించిన వివిధ రకాల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని సబ్ డీఎఫ్‌ఓ దివాకర్ ప్రారంభించారు. స్టాల్స్‌లో జేవీవీ సమ్మర్ క్యాంప్ విద్యార్థులు, సీబీఐటీ, గౌతమి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యుత్, నీటిని ఆదా చేసే విధానం, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, తదితర నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం సబ్ డీఎఫ్‌ఓ దివాకర్ మాట్లాడుతూ భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్న ప్రకృతి మానవ అభివృద్ధికి, మనుగడకు అత్యంత ఆవశ్యకమన్నారు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా వీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని సబ్ డీఎఫ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లక్షుమయ్య, కౌన్సిలర్ ఇర్ఫాన్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ యాలం శంకర్, సూర్యనారాయణరెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, ప్రధాన కార్యదర్శి సునీత, సమ్మర్ క్యాంప్ కోఆర్డినేటర్స్ చరణ్, గురప్ప, అజర్, అక్షయ, ఎఫ్‌బీఓలు హరి, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏకోపార్కు నుంచి ర్యాలీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు ఎకో పార్కు నుంచి ర్యాలీ చేపట్టినట్లు సబ్ డీఎఫ్‌ఓ దివాకర్ తెలిపారు. ఈ ర్యాలీ వాసవి సర్కిల్ వరకు కొనసాగుతుందని చెప్పారు. వాకర్లు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

దళితులంటే అంత చిన్న చూపా

ప్రొద్దుటూరు కల్చరల్ : మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లకు దళితులంటే చిన్న చూపని జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోస మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ పట్టణానికి వచ్చిన సందర్భంగా దర్గాను, అమ్మవారి శాలను సందర్శించారే కానీ ఒక్క చర్చిలోకి రావడం కాని, దళిత నాయకులతో మాట్లాడటం కాని చేయలేదన్నారు. ప్రకాశం జిల్లాలో పర్చూరు ఎమ్మెల్యే దళితుల ఇళ్లను కూల్చివేసి చేపల చెరువు చేశారని ఇలా దళితులపై ఎన్నో దుర్మార్గాలు జరిగినా పట్టించుకోలేదన్నారు. నారా లోకేష్ చర్చిలోకి రాకుండా తమను అంటరాని వారిగా అవమానించి హీనంగా చూశారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం దళితులను, మాలలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప వారి సంక్షేమానికి చొరవ చేపలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని సమూలంగా భూ స్థాపితం చేయడమే మాలల లక్ష్యం అన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.నాగేంద్రబాబులు అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ గత నెల 31 నుంచి ప్రారంభమైన రాష్ట్ర వ్యాప్త జీపుజాత ఆదివారం బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆయా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జీపుజాత బృందానికి సమస్యలను వివరిస్తున్న మున్సిపల్ కార్మికులు

మెరిట్ అవార్డులు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధంశెట్టి చెంచయ్య కల్యాణ మండపంలో ఆదివారం 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన ఆర్యవైశ్య విద్యార్థులకు మెరిట్ అవార్డుల ప్రదానం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఆర్యవైశ్యులకు అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. వివిధ పోటీలలో రాణించిన సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు బహుమతులు అందచేశారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సంధ్యారాణి, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివభాస్కర్, అవోపా అధ్యక్షుడు పద్మనాభం, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, రాజా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మెరిట్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

కాకర్ల నాగశేషారెడ్డి దంపతులకు సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక రాస్తా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాయలసీమ పోలీసు కంప్లెంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ఆయన సతీమణి, 36వ వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల స్వర్ణలతను ఆదివారం ప్రొద్దుటూరు ఇన్నర్‌వీల్ క్లబ్ వారు సన్మానించారు. రాయలసీమ పోలీసు కంప్లెంట్ అథారిటీగా నియామకమైన సందర్భాన్ని పురస్కరించుకుని దంపతులిరువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ ఎల్.సరస్వతి, వైస్ ప్రెసిడెంట్ బి.భారతి, సెక్రటరీ పి.ఉషారాణి, ట్రెజరర్ ఎం.అనురాధ, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, అలవలపాటి అరుణ దేవి పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన భీమేశ్వరస్వామి తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి గణపతి పూజ, అభిషేకాలకరణ, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు బహుమతులు అందజేశారు.



బండలాగుతున్న ఎద్దులు

'వేమన'కు మరింత ఉన్నతాసనం

– ఎత్తు పెంచుతున్న అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం నూతన ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన యోగివేమన విగ్రహానికి మరింత ఉన్నతస్థానాన్ని కల్పించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. న్యాక్ సమయంలో విశ్వవిద్యాలయ ముఖద్వారం వద్ద హడావుడిగా వేమన విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే వేమన విగ్రహాన్ని తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారంటూ పలు విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు విశ్వవిద్యాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో వేమన విగ్రహాన్ని మరింత ఎత్తులో నిర్మించేందుకు వైవీయూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తక్కువ ఎత్తులో ఉన్న వేమన విగ్రహాన్ని తీసి పక్కన ఉంచి, ఏర్పాటు చేయనున్న ఆసనం ఎత్తు పెంపు పనులు ప్రారంభించారు. వారంరోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి మరింత స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక డిజైన్‌తో వేమన విగ్రహాన్ని తిరిగి పున:ప్రతిష్ట చేసేందుకు వైవీయూ అధికారులు చర్యలు చేపట్టారు.



వేమన విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఎత్తు చేస్తున్న దృశ్యం

ఘనంగా ఆరాధన కార్యక్రమం

జమ్మలమడుగు రూరల్: మైలవరం మండలం వద్దిరాల విశ్వాస గృహంలో ఆదివారం జరిగిన ఆరాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు బోనం ప్రభుదాస్ వర్తమానాన్ని అందించారు. కొందరు దేవునితోనే అబద్ధాలు చెబుతూ అక్రమాలు చేస్తుంటారని అందుకు తగిన ప్రతిఫలాన్ని వారు తప్పక అనుభవించి తీరుతారన్నారు. సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు జీఓ నెంబర్ 1,42 అమలు చేయాలన్నారు. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు పీఆర్వోలను పెట్టుకొని గత సంవత్సరం డిసెంబర్ నుంచి అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం నిర్బంధ విద్యను అమలు చేయాలన్నారు. డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విజయ్, ఉదయ్, సునీల్ పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని మాచునూరు, మాచునూరు దళితవాడ, కొత్తపేట గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్‌లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని వారు కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

కడప అర్బన్: కడప నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో చెన్నూరు ఆటో డ్రైవర్లకు ఎస్‌ఐ వెంకటయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడు రోడ్ల వద్ద ఆటోలను అడ్డంగా నిలబెట్టి వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులను కలిగించవద్దని ఎస్‌ఐ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనదారుల దగ్గర అన్ని రకాలైన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పయనం

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలోని చత్రసాల్ స్టేడియంలో నిర్వహించనున్న అండర్-19 తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు ఏపీ అండర్-19 బాలికల జట్టు రైల్వేకోడూరు నుంచి పయనమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి సి. శారద మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కళాజాతా సభ్యులు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశానుసారం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కడప నగరంలో పలుచోట్ల వీధి నాటకాలు, మ్యాజిక్, హాస్య సన్నివేశాలు, ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు నీటిలో వేసినా కరగవని, భూమిలో కలవడం జరగదన్నారు. ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులను, గుడ్డ సంచులను, కాగితపు సంచులను వాడాలని పిలుపునిచ్చారు. విభూతి భాగ్యలక్ష్మి, హరి, వేణు పాల్గొన్నారు.

• కమనీయం.. కల్యాణం

బి.కోడూరు : స్థానిక రామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, తదితరులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు బ్రహ్మశ్రీ రామకృష్ణశాస్త్రి, సత్యనారాయణశర్మ, అమరనాధశర్మ, కొండయ్యశర్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, ఎంపీటీసీ రామకోటి, మండల జేసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

• పోలేరమ్మ జాతర

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రూపరాంపేటలోని పోలేరమ్మ ఆలయంలో జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన బోనాల కార్యక్రమం వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న మహిళలు

• పెద్దమ్మ తల్లి దేవర

దువ్వూరు : మండల పరిధిలోని సంజీవరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పెద్దతల్లి దేవరను ఘనంగా నిర్వహించారు. దేవర సందర్భంగా పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. గ్రామస్తులు మేళతాళాలతో ఊరగింపుగా వచ్చి పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

• కోటపోలేరమ్మకు బోనాలు

పోరుమామిళ్ల : టేకూరుపేట పంచాయతీలో వారం క్రితం విగ్రహ ప్రతిష్ట జరిగిన కోటపోలేరమ్మకు ఆదివారం పరిసర గ్రామాల ప్రజలు బోనాలు పెట్టుకున్నారు. టేకూరుపేట, సూరిశిద్దుపల్లె, పెద్దకప్పలపల్లె, బాలిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు గ్రామదేవతకు వేపమండలు, బోనాలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న ప్రజలు

• దత్తాత్రేయునికి పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజాము స్వామివారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం జై గురుదత్త శ్రీపాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వినియోగం జరిగింది. సేవాసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి

• వైభవంగా ప్రారంభమైన మహోత్సవాలు

బద్వేలు అర్బన్ : మండలంలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం గోపూజ, యాగశాల ప్రవేశం, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనము, అంకురార్పణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు కామసముద్రం లక్ష్మీవెంకటవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలశస్థాపన చేసిన దృశ్యం

ఘనంగా రేణుక యల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దొరసానిపల్లెలో వెలసిన శ్రీ రేణుకా యల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఆలయ మూడో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి నూతన పట్టు వస్త్రాలు, వెండి కవచాలు, పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పలు హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానంతరం 2500 మందిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం 4 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని ఘనంగా ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు డాక్టర్ జేకే రెడ్డి, డాక్టర్ వరలక్ష్మి, కుటుంబ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలరావు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హిందూపురం నుంచి ప్రారంభమైన జీపుజాత ఆదివారం కడప నగరానికి చేరుకుంది. అనంతరం నగరంలోని పాతబస్టాండులోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను హరిస్తోందని తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, సీఐటీయూ నాయకులు విజయ్ భాస్కర్, సుంకర రవి, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్యాలరావు

ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న న్యాక్ కార్యాలయంలో ఉచిత శిక్షణ కోసం ప్రతి యువకుడు దరఖాస్తులు చేసుకోవాలని న్యాక్ ఇన్‌చార్జి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. న్యాక్ కన్‌స్ట్రక్షన్ ఏపీఎస్, ఎస్‌డీఎస్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా 60 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వేయర్ ఎలక్ట్రిషియన్, అసిస్టెంట్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్, కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైనర్, టూవీలర్ మెకానిక్‌లకు సంబంధించి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లి జాగీర్దార్ హజరత్ సయ్యద్ షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉరుసు సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గ్వాలియర్‌కు చెందిన సలీమ్‌జంకార్ అండ్ పార్టీ బెల్గాంకు చెందిన మాషిన్‌చిస్తిలతో గొప్ప ఖవ్వాలి పోటీలను నిర్వహించారు. సాయంత్రం ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఖురాన్ ఖ్వాని నిర్వహించి ఉరుసు మహోత్సవానికి ముగింపు పలికారు. కార్యక్రమంలో సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.